గౌరవనీయులైన శ్రీమతి నిర్మలా సీతారామన్ గారిచే డాక్టర్ ఎస్. ఎల్. భైరప్ప స్మారక ప్రారంభోపన్యాసం

నమస్కారం. విక్రమ్ సంపత్ గారు, రాజలక్ష్మి గారు, దేవేష్ వర్మ గారు, వారితో పాటూ ఎంతో ఆసక్తిగా విచ్చేసిన విశిష్ట శ్రోతలారా, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. విక్రమ్ వీటన్నింటినీ ఒకచోట చేర్చడానికి, నాకు తెలిసినంతవరకు, గత 12-13 సంవత్సరాలుగా ఎంతో కఠోరమైన, లోతైన నిబద్ధతతో కూడిన సంస్థాగతమైన కృషిని నేను ఇక్కడ చూడగలుగుతున్నాను. ఈరోజు వివిధ విభాగాలలో అవార్డులు గెలుచుకున్న విజేతలందరికీ నా అభినందనలు.

నన్ను అడిగితే, ఈ ప్రయత్నం కాస్త ఆలస్యంగానే ప్రారంభమైందని నా అభిప్రాయం. అలా అని విక్రమ్ ప్రయత్నాలను తక్కువ చేయడం నా ఉద్దేశం కాదు. భారతదేశానికి కనీసం నాలుగు లేదా ఐదు దశాబ్దాల క్రితమే ఇలాంటి ప్రయత్నం అవసరమైంది. మనం ఆ అవకాశాన్ని చేజార్చుకున్నాం, నిజానికి, నాలుగయిదు దశాబ్దాలుగా ఇటువంటి ప్రయత్నాలు చేయకపోవడం వలన మన చరిత్రను, మన సామాజిక జీవితాన్ని తప్పుగా, సత్యదూరంగా ప్రచారం చేయడంలో ప్రత్యర్థులను మరింత శక్తివంతంగా మార్చింది. నేను మాట్లాడుతూ మధ్యలో దీని గురించి మరలా కొంతవరకు ప్రస్తావిస్తాను.

నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పుట్టినరోజు. భారతదేశం దీనిని 'ఉపాధ్యాయ దినోత్సవం'గా జరుపుకుంటుంది, అదే సమయంలో మనం 'గురుపౌర్ణమి'ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటాం. రాధాకృష్ణన్ గారి పాండిత్యం, భారతీయ వైదిక సంప్రదాయాలపై ఆయనకున్న గాఢమైన అవగాహన కారణంగా సెప్టెంబర్ 5వ తేదీన ఆయనను ఖచ్చితంగా స్మరించుకుంటాం. భారతదేశ లౌకిక చరిత్ర ప్రకారం ఆ రోజు ఉపాధ్యాయ దినోత్సవం కూడా. కాబట్టి, గురు పౌర్ణమి మరియు సెప్టెంబర్ 5వ తేదీ - ఇలా ఎన్ని రోజులైనా మనం ఉపాధ్యాయులను పూజించవచ్చు. ఈ ఉదయం మన తరానికి, భవిష్యత్ తరానికి అత్యంత కీలకమైన ఎన్నో విషయాల గురించి మాట్లాడటానికి మీ ముందు నిలబడటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

ఢిల్లీలో భారీ వర్షం కురుస్తున్న ఈ రోజున, ఈ అంశంపై చర్చించే అవకాశాన్ని కల్పించినందుకు విక్రమ్‌కు నేను మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. విక్రమ్ చేసిన గొప్ప కృషి గురించి వినడానికి ఇక్కడ ఇంకా చాలా మంది ప్రజలు వచ్చి ఉండేవారని నాకు తెలుసు. ఆలోచనాపరుడిని, ఉపాధ్యాయుడిని వేరు చేయలేము కాబట్టి, మనం వారిద్దరినీ గౌరవిస్తాము.

ఇక, స్మారకోపన్యాసంలో డాక్టర్ భైరప్ప గురించి మాట్లాడే ముందు, ఈ రోజు ప్రదానం చేస్తున్న బహుమతులు, వాటికి పెట్టిన పేర్ల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాల్సి ఉంది. వారెవరంటే - ఆర్.సి. మజుందార్, ఎస్.ఎల్. భైరప్ప, అనంత్ పాయ్ లు. వీరు మంచి స్ఫూర్తిని సజీవంగా ఉంచిన ముగ్గురు గొప్ప వ్యక్తులు.

ఈ అవార్డుల కోసం ఎంపిక చేసిన పేర్లే మనకు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి: చరిత్ర పుస్తకాలు, వార్తాపత్రికలు , సాంస్కృతిక అకాడమీల వంటి వాటిలో ఏవి ఉండాలో నిర్ణయించే అధికారం కలిగిన భారతీయ ఉన్నత వర్గాలు, అలాగే సామాన్య ప్రజలూ వీరందరూ కలిసి ఎటువంటి మహనీయులను విస్మరించారో ఈ పేర్లు తెలియజేస్తాయి. కాబట్టి, విక్రమ్, మీరు చేసిన ఈ ఎంపిక ప్రక్రియ ఎంతో అభినందనీయం, ప్రశంసనీయం. తన భావజాలాన్ని అనుసరించేవారికి పరిస్థితులు క్లిష్టంగా మారుతున్న తరుణంలో, మనకు సరైన మార్గాన్ని చూపిన వ్యక్తిగానూ, గొప్ప నవలా రచయితగానూ ఎస్.ఎల్. భైరప్పను భారతదేశం ఇప్పుడు గౌరవించి, స్మరించుకోవడం ఎంతో అర్థవంతమైన విషయం.

ఆయన డాక్టరేట్ 'సిద్ధాంత వ్యాసానికి' ఆయన జీవిత గమనాన్నే నిర్వచించేలా 'సత్యం , సౌందర్యం' (కన్నడలో 'సత్య మత్తు సౌందర్య') అని పేరు పెట్టారు. దీనిని 1966లో బరోడాలోని మహారాజా సయాజీరావు విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఆయన విద్యాపరమైన ప్రయాణం ఎంతో కఠినమైనది. తన ఆత్మకథ 'భిత్తి'లో తీవ్ర పేదరికం, చిన్నతనంలోనే తల్లిని కోల్పోవడం, అస్థిరమైన కుటుంబ పరిస్థితులు, అలాగే ప్లేగు వ్యాధి కారణంగా తోబుట్టువులను, బంధువులను కోల్పోవడం వంటి అంశాలతో కూడిన తన బాల్యాన్ని భైరప్ప గుర్తుచేసుకున్నారు. మాటల్లో వర్ణించలేనంతటి దుర్భరమైన జీవితం అది.

అందువల్ల, ఆయన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో, వేర్వేరు కాలాల్లో బంధువుల వద్ద పెరిగారు. ఎన్నో కష్టాల మధ్య తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. ఆయన స్వయంగా అనుభవించిన ఆ వాస్తవిక పరిస్థితులు ఆయన రచనలకు పరిణతిని చేకూర్చాయి. ఆయనలో ఎటువంటి చేదు భావనలు లేవు. సంయమనం, భావోద్వేగాలకు లోనుగాని వాస్తవికత ఆయన రచనల ప్రత్యేకతలు. ఆ ప్రత్యక్ష అనుభవానికి, అసాధారణమైన కృషి , సన్నద్ధత తోడయ్యాయి. శాస్త్రీయ సంగీత విద్వాంసుల ఇతివృత్తంతో రాసిన తన ప్రధాన నవల 'మంద్ర'ను (ఇక్కడ విక్రమ్ కూడా సంగీతం, సంగీతకారుల గురించి పనిచేస్తున్నారు కదా) రచించడానికి ముందు, భైరప్ప స్వయంగా శాస్త్రీయ సంగీతాన్ని నేర్చుకోవడమే కాకుండా, గాయకులతో చాలా కాలం గడిపారు.

ఆ అనుభవం గురించి రాయడానికి ముందు, ఆయన స్వయంగా ఈ అనుభవాన్ని పొందాలనుకున్నారు. అందుకే ఆయన దాని గురించి రాసినప్పుడు, అందులో ఎంతో ప్రామాణికత, నిజాయితీ కనిపించేవి. ఆయన రాసిన ప్రతి మాటలోనూ ఆ భావనను మనం ప్రత్యక్షంగా అనుభవించవచ్చు. ఆయన గాయకులతో కలిసి ఎక్కువ కాలం గడిపారు. ఆ ప్రపంచానికి సంబంధించిన కళను, వారి జీవితాలను అంటే వారి ఆశయాలు, క్రమశిక్షణ, అభద్రతా భావం , ఆ ప్రపంచంలోని సంక్లిష్టమైన సంబంధాలను అర్థం చేసుకోవాలని ఆయన కోరుకున్నారు. ఆయన రాసిన మరో గొప్ప రచన 'పర్వ'. ఈ రచన కోసం, కురుక్షేత్రం, హస్తినాపురంతో సహా మహాభారతానికి సంబంధించిన అనేక ప్రదేశాలను ఆయన స్వయంగా సందర్శించారు. అలాగే, ఇటీవలి కాలం వరకు 'భ్రాతృ బహుభర్తృత్వం' వంటి పద్ధతులు కొనసాగిన హిమాలయ ప్రాంతంలోని సమాజాల గురించి కూడా ఆయన అధ్యయనం చేశారు.

ఆయన మహాభారతాన్ని రాసి ఉండవచ్చు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలన్నింటినీ పరిశీలించి ఉండవచ్చు, లేదా భారతదేశంలో ఇప్పటికే వివిధ భాషలలో వెలువడిన మహాభారత రచనలను విశ్లేషించి ఉండవచ్చు. కానీ అలా చేయకుండా, ఆయన స్వయంగా ఆయా ప్రాంతాలకు వెళ్లారు. ఆ ప్రజల మధ్య గడపడం ద్వారా వారి జీవన విధానాన్ని, అనుభూతులను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని ఆయన భావించారు. పాఠకులతో నిజాయితీగా సంభాషించాలని కోరుకునే రచయిత ఎంతటి శ్రమకు, ఎంతటి అనుభవాలకు లోనవుతారో ఆ ప్రక్రియలో వారు పడే శ్రమ ఆ పుస్తకం చెప్పే విషయాల కన్నా కూడా ఎక్కువగా ఆ రచయిత వ్యక్తిత్వం గురించే మనకు తెలియజేస్తుంది. భైరప్ప గారు అటువంటి దృఢమైన వ్యక్తిత్వం కలిగినవారు. అందుకే, అటువంటి కుటుంబాలు, కుటుంబ వ్యవస్థలు, అనురాగం, బాధ్యత, అసూయ, సాన్నిహిత్యం వంటి భావాలను ఏ విధంగా, ఎంతమేరకు తీర్చిదిద్దుతాయో లోతుగా పరిశీలించే అవకాశం ఆయనకు లభించింది.

కాబట్టి, ఆయన మొదట తనదైన ప్రపంచంలోకి ప్రవేశించి, ఆ తర్వాత దానిని మన కోసం పునఃసృష్టి చేశారు. ఈ రకంగా లీనమయ్యే గుణమే ఆయన రచనల యొక్క గొప్ప శక్తులలో ఒకదానిని వివరిస్తుంది. ఆయన మానవ సంబంధాలను చిత్రించే సూక్ష్మత చాలా బాగుంటుంది. ఆయన పాత్రలు ఎన్నడూ ఒక భావజాలానికి కట్టుబడి ఉండవు. ఒత్తిడిలో ఉన్నప్పుడు మనుషులు ఎలా స్పందిస్తారో, కర్తవ్యం, కోరిక ఎలా ఢీకొంటాయో, భావనలో ఒక చిన్న మార్పు మొత్తం సంబంధాన్ని ఎలా మార్చగలదో మనం చూస్తాము. పాఠకుడు కేవలం కథనాన్ని అనుసరించడమే కాదు. పాఠకుడు దానిలో లీనమైన అనుభూతిని పొందుతాడు. కాబట్టి ఈ పద్ధతి వెనుక ఒక స్పష్టమైన సాహిత్య తత్వం ఉంది. "నేను ఎందుకు రాస్తాను?" అని అర్థం వచ్చే "నాను యాకె బరియుత్తేనె" అనే పుస్తకంలో, సాహిత్యం వామపక్ష, దక్షిణపక్ష లేదా మరే ఇతర 'వాదానికి' అయినా ఒక సాధనంగా మారాలనే లేదా నిర్దేశిత సామాజిక ప్రగతి కార్యక్రమానికి వాహనంగా ఉండాలనే ఆలోచనను భైరప్ప తిరస్కరించారు.

కాబట్టి, భరతుని నాట్యశాస్త్రాన్ని ఆధారంగా చేసుకుని, సాహిత్యం పాఠకుడిని రసంలో లీనం చేయాలని ఆయన వాదించారు: ఆశ్చర్యం, దుఃఖం, ధైర్యం, సున్నితత్వం.. అనేవి మనం నవరసాలు అని పిలిచే మానవ భావోద్వేగాల సంపూర్ణ పరిధి. దాని కర్తవ్యం అనుభవాన్ని గాఢతరం చేయడం, సున్నితత్వాన్ని మెరుగుపరచడం, అంతేగానీ ఒక రాజకీయ ముగింపును నిర్దేశించడం కాదు. అందుకే ఆయన నవలలు కృత్రిమంగా కాకుండా, జీవించినట్లుగా అనిపిస్తాయి. డాక్టర్ భైరప్ప నా దృష్టిలోకి మొదటిసారిగా ఎలా వచ్చారో అనే దానిపై నా వ్యక్తిగత ఆలోచనను పంచుకోవడానికి నన్ను అనుమతించండి.

దశాబ్దాల క్రితం, నేను 'వంశవృక్ష' నాటకాన్ని చూశాను. అందులో అనుభవంలేని బృందం, కానీ వారు ప్రదర్శించారు. ప్రేక్షకులలో కూర్చుని, ఆ పాత్రలు వారి సంప్రదాయం, కర్తవ్యంతో చేసే పోరాటాలు చూసేటపుడు, ఆ ప్రదర్శనలోని ఉత్కంఠ నాతోనే అలాగే ఉండిపోయింది. ఇది తమిళనాడులోని తిరుచిలో జరిగింది.

నేను ఈ విషయాన్ని ప్రస్తావించడానికి కారణం ఏమిటంటే, ఆ 'వేదిక' అనేది నా జ్ఞాపకాల్లోని కేవలం ఒక స్థలం మాత్రమే కాదు; ఈ రోజు నేను మీ ముందు ఉంచదలచిన అంశానికి అది ఒక ప్రధాన ప్రతీక. డాక్టర్ భైరప్ప గారి సాహిత్య ప్రస్థానాన్ని పరిశీలిస్తే, అందులో సుమారు 15 ఏళ్ల వ్యవధితో వేరుపడిన రెండు విభిన్నమైన శిఖరాయమాన దశలు కనిపిస్తాయి. మొదటిది 1965 , 1979 మధ్యకాలంలో నెలకొన్న కళాత్మక శిఖర దశ. ఇది 'వంశవృక్ష', 'గృహభంగ', 'దాటు' (దీనికి 1975లో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది), చివరగా 'పర్వ' వంటి అద్భుతమైన రచనలు వెలువడిన కాలం. ఇక రెండవది అపూర్వమైన ప్రజాదరణను పొందిన దశ. ఇది సుమారు 2007లో మొదలైంది. ఆ సమయంలో 'ఆవరణ' పుస్తకం ప్రచురణకు ముందే అమ్ముడైపోవడమే కాకుండా, కేవలం 5 నెలల్లోనే 10 సార్లు పునర్ముద్రణ పొందింది. ఇది భారతీయ ప్రచురణ రంగంలోనే ఒక రికార్డు. అలాగే 'పర్వ' నవల కూడా 19 ముద్రణల వరకు చేరుకుంది.

భైరప్ప రాసిన ఆరు నవలలను భారతీయ చలనచిత్ర రంగానికి చెందిన ప్రముఖులు సినిమాలుగా మలిచారు. 'వంశవృక్ష' నవల ఆధారంగా గిరీష్ కర్నాడ్ రూపొందించిన చిత్రానికి 1971లో జాతీయ పురస్కారం లభించగా, గిరీష్ కాసరవల్లి 'నాయి నెరలు'ను వెండితెరపై ఆవిష్కరించారు. అయితే, ఇక్కడే ఒక ఆసక్తికరమైన వైరుధ్యం కనిపిస్తుంది. భైరప్ప రచనలను సినిమాలుగా మలిచి జాతీయ స్థాయి గుర్తింపు పొందిన ఆ దిగ్గజాలే, తర్వాతి కాలంలో ఆయనపై తీవ్రమైన విమర్శలు గుప్పించి వ్యతిరేకించిన వారూ ఉన్నారు. ఆయన నిజాయితీయే ఆయనను ఒక నిర్దిష్ట చట్రంలో ఇరికించేలా చేసింది. ఆయనను అలా ఎందుకు ఒక చట్రంలో బంధించారు? దానికి ఆయన సాహిత్య నైపుణ్యంతో ఎలాంటి సంబంధం లేదు. కేవలం ఆయన ఆలోచనల్లోనూ, అభివ్యక్తిలోనూ ఉన్న రాజీలేని నిజాయితీయే దానికి ప్రధాన కారణం.

టిప్పు సుల్తాన్ వంటి సంక్లిష్ట చారిత్రక వ్యక్తుల విషయంలో, సమకాలీన రాజకీయ సౌకర్యాలకు అనుగుణంగా చారిత్రక ఆధారాలను మృదువుగా మార్చడానికి ఆయన నిరాకరించారు. 91 ఏళ్ల వయసులో, ఆయన తన నిర్ధారణలను సూటిగా చెప్పారు "టిప్పు మూలత క్రూరి"- కన్నడలో, అదే భైరప్ప చెప్పింది. టిప్పు మూలతః ఒక క్రూరమైన వ్యక్తి. "టిప్పువన్ను హీరో మాడికొండు బరెయుత్తారే", అంటే "వారు టిప్పును హీరోగా చిత్రీకరిస్తూనే ఉంటారు" మళ్ళీ, ఇది భైరప్ప పరిశీలనే. ఈ రకమైన మేధోపరమైన నిజాయితీ, చారిత్రక ఆధారాల నుండి తాను కనుగొన్నదాన్ని చెప్పడంలో నిజాయితీ, దానిని వ్యక్తీకరించడంలో నిజాయితీ ఆయనను ఒక పరిధిలో బంధించేలా చేసింది.

ఆయన్ని ఒక నిర్దిష్ట వర్గంలోకి నెట్టివేయడం అందరికీ సౌకర్యవంతంగా అనిపించింది. అంటే, "ఆయన ఒక భిన్నమైన చరిత్రను తీసుకురావాలనుకునే వారిలో ఒకరు. కానీ మేము మీకు అందించదలచుకున్న చరిత్ర ఇదే, దీనినే అంగీకరించండి లేదా వదిలేయండి, అంతే తప్ప ఆ మరో చరిత్రకు మాత్రం మేము చోటు ఇవ్వము" అని భావించడం. కానీ ఆ 'మరో చరిత్ర' అనేది నిజానికి వేరొకటి కాదు. అదే వాస్తవం. ఈ మాటలు నావి కావు భైరప్ప గారివి; ఆయన 2022 నవంబర్ 14న మైసూరులో ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వివరాలు మీకు లభిస్తాయని నాకు నమ్మకం ఉంది. 'టిప్పు నిజ కనసుగలు' అనే నాటక ఆవిష్కరణ సందర్భంగా ఆయన ఈ మాటలు అన్నారు. వాస్తవానికి అది చారిత్రక ఆధారాల పరిశోధనపై ఆధారపడిన ఒక ప్రకటన మాత్రమే, కానీ దానిని రాజకీయపరమైన కఠిన వైఖరిగా పరిగణించి విమర్శించారు. అయినప్పటికీ, తన రచనా వ్యాసంగానికి సంబంధించిన పరిధుల విషయంలో ఆయనకు ఎప్పుడూ స్పష్టత ఉండేది.

"రాయడమే నా మాధ్యమం. నేను రాస్తాను, నిప్పు పెట్టను." 2018 జనవరి 19న జరిగిన 'నృపతుంగ అవార్డు' ప్రసంగం సందర్భంగా ఆయన కన్నడలో ఈ మాటలు అన్నారు. అంటే, డాక్టర్ భైరప్ప గొంతును ఎవరూ అణచివేయలేదు. కానీ సంస్థాగతంగా ర్యాంకింగుల విషయంలో మాత్రం ఆయనను పక్కనపెట్టే ప్రయత్నం జరిగింది. కర్ణాటకలో 'నవ్య' సాహిత్య ఉద్యమానికి ఆద్యుడైన యు.ఆర్. అనంతమూర్తి, భైరప్పను ఒక నవలా రచయితగా కాకుండా కేవలం ఒక 'వాదోపవాదాలు చేసే వ్యక్తి'గా పరిగణించి కొట్టిపారేశారు. భైరప్ప కేవలం వాదించగలరే తప్ప నవలా రచయితగా గొప్ప రచనలు చేయలేరని పేర్కొంటూ, ఆయనను తక్కువ చేసి మాట్లాడాలని అనంతమూర్తి భావించిన సందర్భం అది (సుమారు 2007 మే నెలలో).

అప్పటి కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడైన చంద్రశేఖర పాటిల్, ఆవరణపై చాలా అవమానకరమైన రీతిలో దాడి చేశారు. చదువరులు ఆయనను కీర్తించారు, కానీ సంస్థాగత సంరక్షకులు మాత్రం గౌరవించలేదు. అయినప్పటికీ, అప్పటికే పాతుకుపోయిన ఆ వ్యవస్థ, తమ సొంత ఆరాధ్యులతో పాటు ఆయనకు స్థానం ఇవ్వడానికి నిరాకరించింది. ఆయనను అత్యంత కఠినంగా విమర్శించిన వారే జ్ఞానపీఠ పురస్కారాలను అందుకున్నారు. భైరప్పకు మాత్రం అది ఎన్నడూ

లభించలేదు. ఇది మన జాతీయ, మేధోపరమైన చర్చల పదజాలంలోని మౌలిక వక్రీకరణను మనకు నేరుగా తెలియజేస్తుంది. సాంప్రదాయ రాజకీయ పదజాలంలో, మనం వివిధ ఛాయల గురించి తేలికగా మాట్లాడుతాము. మనం సంప్రదాయవాద ఉదారవాది, ఉదారవాద ఉదారవాది, అతివాద ఉదారవాది గురించి వింటాము. ఇవి ప్రజలను ఒక మూసలో ఇరికించడానికి ఇచ్చే బిరుదులు.

అయినప్పటికీ ఆధునిక భారతదేశంలో, ఈ త్రాసును ఏకపక్షంగా ఎలా తారుమారు చేశారో చూడండి. పత్రాలతో కూడిన చారిత్రక వాస్తవాలను సమర్పించే ఒక భారతీయ సంప్రదాయవాద ఉదారవాదిని తక్షణమే తీవ్ర దక్షిణపక్షవాదిగా ముద్ర వేస్తారు. ఈ తీవ్రవాద ముద్రను మరో వైపు ఎన్నడూ వేయరని గమనించండి. నిష్పక్షపాతంగా, నిక్కచ్చిగా, వాస్తవాల ఆధారంగా మాట్లాడే పండితుడిని మధ్యేమార్గంలో ఉండటానికి ఎన్నడూ అనుమతించరు. అతడిని కేంద్ర ఉదారవాదిగా, నిష్కపటమైన ఉదారవాదిగా, లేదా నిజాయితీపరుడైన ఉదారవాదిగా ఎన్నడూ గుర్తించరు. మన ప్రజా సంభాషణలో మధ్య బిందువు ఉన్న త్రాసు అంటూ ఏదీ లేదు. "ఉదారవాది" అనే పదం, భారత సమాజాన్ని కేవలం ఒక వామపక్ష భావజాల కోణం నుంచే చూసేవారి ప్రైవేట్ గుత్తాధిపత్యంలా తయారైంది. ఆ వామపక్ష భావజాల కోణం నుంచి ఇక్కడే వైస్ ఛాన్సలర్ శాంతిశ్రీ ప్రతిరోజూ దానిని ఎదుర్కొంటున్నారు.

ఇది నిజమైన భారతీయ ఉదారవాద విలువలకూ, బయటి నుండి రుద్దబడిన ఉదారవాదానికీ మధ్య ఉన్న విభజన రేఖ. మొదటిది 'పూర్వ పక్షం'లో వేళ్ళూనుకున్న ఒక ప్రాచీన చర్చా విధానం. అంటే, ఎదుటివారి వాదనను ఖండించే ముందు, ఆ వాదనను అత్యంత బలమైన, స్పష్టమైన రీతిలో ముందుగా వివరించడం. అది భారతీయ సంప్రదాయం. 'పూర్వ పక్షం' అదే చెబుతుంది. ఇక రెండవది ఒక ముఖ్యమైన 'సభ్యత్వ కార్డు' లాంటిది. ఇందులో స్వయం-నియమిత ద్వారపాలకుడు ఒకరు, వేదికపైకి ఎవరికి ప్రవేశం లభిస్తుందో లేదా ఎవరికి లభించదో నిర్ణయిస్తారు. ఆత్మవిశ్వాసం కలిగిన ఒక నాగరికతలో, ప్రజా చర్చ అనేది ఒక బహిరంగ వేదికలా సాగాలి. ఆ వేదికపై ఎడమ వైపున, కుడి వైపున స్థలం ఉండాలి. అన్నిటికంటే ముఖ్యంగా, మధ్యలో కూడా ఒక స్థానం ఉండాలి.

ఆలోచనాపరులు ఇరువైపుల నుంచీ రంగప్రవేశం చేయగలగాలి. వారే నటులు, వారు వేదికపైకి వచ్చి, మధ్యలో నిలబడి తమ వాదనలను మీ ముందు ఉంచుతారు. కాబట్టి, వారు ఇరువైపుల నుంచీ వచ్చి, తమ వాదనలను వేదిక మధ్యలోకి తీసుకువచ్చి, ఆలోచనల మధ్య బహిరంగ సంఘర్షణకు అవకాశం కల్పించాలి. ఆ తర్వాత, వాటిపై ఆలోచించి ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకోవడం ప్రేక్షకుల బాధ్యత. మన సంస్కృతి దీనిని 'మథనం' అని.. అంటే ఒక మేధోపరమైన 'సముద్ర మథనం' అని పిలుస్తుంది. మందర పర్వతానికి ఇరువైపులా దేవతలు, అసురులు ఎలాగైతే నిలబడ్డారో, అలాగే పరస్పర విరుద్ధ శక్తుల మధ్య జరిగిన సంఘర్షణ లేదా ఘర్షణ ద్వారానే సత్యమనే అమృతం ఉద్భవించింది. అదే మన తత్వశాస్త్రం, అదే మన సంప్రదాయం, అదే మన DNAలో ఇమిడి ఉంది.

ఆ నాటకం ఎప్పటికీ ముగియదు. అది ప్రేక్షకులను ప్రశ్నలతోనూ, స్వతంత్రంగా ఆలోచించే బీజాలతోనూ మన మనసును నింపి పంపుతుంది. కాబట్టి, రెండు పక్షాల మధ్య జరిగే నిరంతర సంఘర్షణను, తమ తమ వైపుల నుంచి వారు చేసే ప్రయత్నాలను ప్రేక్షకులు చూస్తారు. చివరకు వెలువడే ఫలితం వారి కళ్ల ముందే ఉంటుంది. అయితే, దశాబ్దాలుగా మన సాంస్కృతిక , మేధోపరమైన వ్యవస్థలో ఒక వైపునకే అధిక ప్రాధాన్యత లభించింది. సాహిత్యం, విద్యారంగం, సంగీతం, నాటకం, సినిమా.. ఇలా అన్ని రంగాల్లోనూ ప్రత్యామ్నాయ ఆలోచనా విధానాలు వెనుకకు నెట్టివేయబడ్డాయి. ఒక నిర్దిష్ట భావజాలం కలిగిన ఆ ఒక్క పక్షం ఎంతగా ఆధిపత్యం చెలాయించిందంటే, భైరప్ప వంటి కొద్దిమంది మినహా, అవతలి పక్షాన్ని అది పూర్తిగా తుడిచిపెట్టేసేంత పరిస్థితి ఏర్పడింది.

కేవలం ఒక వర్గానికి చెందిన నటులతో కూడిన వేదిక ఒక నాటకాన్ని ప్రదర్శించదు. అది ఒక భావజాల ఏకపాత్రాభినయాన్ని అందిస్తుంది. రెండవ వర్గం కూడా నిమగ్నమై ఉండేలా చూడటంలోనే డా.భైరప్ప మేధోపరమైన ధైర్యం ఉంది. సంస్థాగత న్యాయనిర్ణేతలు వ్యతిరేకించినప్పటికీ, ఆయన తన లక్షలాది పాఠకుల ప్రత్యక్ష మద్దతుతో బయటి నుంచే ఆ అడ్డంకిని బద్దలుకొట్టారు. అసలు ఉనికిలోనే లేదని అధికార వర్గం ఎప్పటినుంచో వాదిస్తున్న చైతన్యవంతమైన ప్రేక్షకవర్గం రెండవ వర్గానికి ఉందని ఆయన నిరూపించారు. కానీ ఈ తిరస్కరణ నిర్మాణం ఈ దేశంలో కొనసాగాల్సిన ప్రధాన చర్చనీయాంశంగా నేను దీనిని వదిలివేయాలనుకుంటున్నాను.

వీటన్నింటికీ చాలా లోతైన మూలాలు ఉన్నాయి. భారతదేశ మేధోపరమైన రంగం నుండి ఒక నిర్దిష్ట వర్గం లేదా దృక్పథం పక్కనపెట్టబడే ప్రక్రియ 1947కు ముందే మొదలైంది. అది వలసవాద చరిత్ర రచనలో ప్రారంభమైంది. ఏయే సందర్భాల్లో వాస్తవాలను నిరాకరించే ధోరణి మొదలైందో, అవార్డు గ్రహీత అయిన గత వక్త చెప్పడం మీరు విన్నారు. నేను ఆ విషయాన్ని ఇక్కడ ప్రస్తావించాలనుకోలేదు, కానీ నేడు మనం చూస్తున్న చరిత్ర... నేటి అవార్డులలో బెంగాల్ ఆధిపత్యం ఉందని విక్రమ్ సరిగ్గానే చెప్పారు. బెంగాల్: క్లైవ్ ప్లాసీ యుద్ధం చేసినప్పుడు మనం వినే ఆ యుద్ధం జరిగిన ప్రాంతం అది. మనం చదివే చరిత్రలో, టిప్పు సుల్తాన్ విషయంలో లాగానే, బెంగాల్‌కు చెందిన ఓడిపోయిన పాలకుడి క్రూరత్వం గురించి ఎక్కడా ప్రస్తావించరు.

ప్లాసీ యుద్ధం తర్వాత క్లైవ్ ఎక్కడికి వెళ్లినా, బెంగాల్ ప్రజలు అతనికి ఘనస్వాగతం పలికారు. ఇక్కడ మన దురదృష్టకరమైన పరిస్థితిని గమనించండి. ఎందుకంటే అతను ఆ క్రూరమైన పాలకుడిని ఓడించాడు! ఇది దురదృష్టకరమైన విషయమే అయినప్పటికీ, చరిత్రలో ఇలాంటి అంశాలు తరచుగా చూపించబడవు. “ఒక భారతీయ రాజు, ఒక జాతీయవాద రాజు ఆంగ్లేయ వర్తకుడి చేతిలో ఓడిపోయాడు” అని మీరు వింటూ ఉంటారు, కానీ ఓడిపోయిన ఆ రాజు యొక్క క్రూరత్వం గురించి మాత్రం మీరు వినరు. దీనివల్ల క్లైవ్ గొప్పవాడు అయిపోడు, కానీ వాస్తవం ఏమిటంటే: చరిత్రను తమకు అనుకూలంగా మలచుకుని (లేదా వాస్తవాలను కప్పిపుచ్చి) ఇలా చిత్రీకరించారు. అందుకే, భారతీయ విద్యపై రాసిన తన నివేదికలో (మినిట్ ఆఫ్ ఇండియన్ ఎడ్యుకేషన్), మెకాలే ఇలా స్పష్టం చేశారు: “వారిలో ఒక్కరిని కూడా నేను చూడలేదు”. నేను ఆయన మాటలనే ఉటంకిస్తున్నాను ‘‘ఒక మంచి యూరోపియన్ గ్రంథాలయంలోని ఒక అర (shelf) పుస్తకాలు, భారతదేశం, అరేబియాలకు చెందిన సమస్త దేశీయ సాహిత్యం కంటే విలువైనవని కాదనగలిగే వ్యక్తి ఒక్కరు కూడా వారిలో నాకు కనిపించలేదు.”

“సంస్కృత భాషలో రాయబడిన అన్ని పుస్తకాల నుండి సేకరించిన చారిత్రక సమాచారం అంతా, ఇంగ్లాండ్‌లోని ప్రిపరేటరీ పాఠశాలల్లో ఉపయోగించే అత్యంత అల్పమైన సంక్షిప్త గ్రంథాలలో లభించే దానికంటే తక్కువ విలువైనది,” అని ఉల్లేఖనం ముగిసింది. ఈ ఉల్లేఖనంలో చెప్పబడిన ఈ అర్థంలేని మాటల తీవ్రత మన బుర్రల్లోకి ఇంకిపోయిందని నేను ఆశిస్తున్నాను. ఇది జనరల్ డిపార్ట్‌మెంట్‌లో, 2 ఫిబ్రవరి 1835న, మెకాలే యొక్క విద్యా రికార్డుల నుండి ఎంపికలు అనే

పత్రంలో నమోదు చేయబడింది. అతను ఆ మినిట్‌ను ఇలా అంగీకరిస్తూ ప్రారంభించాడు. ఇందులోని వ్యంగ్యాన్ని, అహంకారాన్ని చూడండి: అతను రాసిన ఆ మినిట్ "నాకు సంస్కృతం గానీ, అరబిక్ గానీ తెలియదు" అనే వాక్యంతో మొదలవుతుంది.

కానీ అతను ముగించడానికి ఎంత ధైర్యం చూపించాడు! అతను మొదట తన అజ్ఞానాన్ని ఒప్పుకుని, వెంటనే తన తీర్పును వెలువరించాడు. అలాగే ఏ దశలోనూ అతను సాక్ష్యాధారాల గురించి పట్టించుకోలేదు. ఆ క్రమంలో ఇచ్చిన తీర్పు, విచారణ ప్రారంభం కాకముందే విధించిన శిక్ష లాంటిది. అది ఒక ఉపఖండం యొక్క విద్యా విధానంగా మారింది. 1817లో, జేమ్స్ మిల్ 'ది హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా'ను ప్రచురించాడు, ఇది హేలీబరీలో ప్రామాణిక పాఠ్యపుస్తకంగా ఉండేది, అక్కడ కంపెనీ మనల్ని పరిపాలించడానికి పంపిన వారికి శిక్షణ ఇచ్చింది. ఈ జేమ్స్ మిల్ 1817 'హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా'ను భారతదేశంలో అడుగు పెట్టకుండా లేదా భారతీయ భాషను నేర్చుకోకుండానే రాశాడు, ఎందుకంటే సరైన అర్హత ఉన్న వ్యక్తి భారతదేశంలో తన కళ్ళు, చెవులను జీవితకాలం ఉపయోగించడం కంటే, ఇంగ్లాండ్‌లో ఒక సంవత్సరంలో చదువుకోవడం ద్వారా భారతదేశం గురించి ఎక్కువగా తెలుసుకోగలడని అతను భావించాడు.

భైరప్ప వివిధ ప్రాంతాలకు వెళ్లి, అక్కడి ప్రజలతో కలిసి జీవించి, వారి నేపథ్యాన్ని అర్థం చేసుకుని ఆ పుస్తకాన్ని ఎలా రాశారో నేను చెప్పిన విషయంతో దీనిని పోల్చి చూడండి. కానీ ఆయనను ఒక పరిధిలో బంధించి ఉంచుతున్నారు. మనకు నిరంతరం ఇదే విషయాన్ని అందిస్తున్నారు. మన పాఠశాలలు, కళాశాలల్లో ఇదే బోధిస్తున్నారు. వారు తక్కువ చేసి చూసిన ఆ నాగరికత, వేల సంవత్సరాలుగా అత్యంత పరిణతి చెందిన చారిత్రక రికార్డులను భద్రపరుస్తూ వచ్చింది. క్రీ.శ. 1148, 1150 మధ్య కాలంలో కాశ్మీర్‌లో రచనలు చేసిన కల్హణుడు, చరిత్రకారుడి బాధ్యతను నిర్వచించడంతోనే తన 'రాజతరంగిణి' గ్రంథాన్ని ప్రారంభించాడు. ఆయన సంస్కృతంలో ఏం చెప్పారో నేను అనువదించి చెప్పే ప్రయత్నం చేస్తాను చూడండి: "గత సంఘటనలను వివరించేటప్పుడు, రాగద్వేషాలకు అతీతంగా ఉండి, న్యాయమూర్తి వలె నిష్పాక్షికంగా వ్యవహరించే ఆ ఉత్తమ వ్యక్తి మాత్రమే ప్రశంసనీయుడు" అని ఆయన పేర్కొన్నారు.

కల్హణుడు రచించిన 'రాజతరంగిణి' (క్రీ.శ. 1148 నాటి చారిత్రక గ్రంథం) గురించి ఆలోచించండి. మరోవైపు, తర్వాతి శతాబ్దాలలో మెకాలే లాంటి వారు సంస్కృతం లేదా అరబిక్ భాషలు తెలియకపోయినా, "వాటి గురించి నా తీర్పును ఇస్తాను" అని ప్రకటించడం చూస్తాం. కానీ 'రాజతరంగిణి'లో కనిపించేది నిజమైన నిష్పాక్షికతకు ఒక నిర్వచనం. మెకాలే కాలానికి ఎనిమిది శతాబ్దాల ముందే సంస్కృతంలో రాయబడిన ఆ గ్రంథంలోని దృక్పథాన్ని ఏ ఆధునిక చరిత్రకారుడైనా సంతోషంగా అంగీకరిస్తారు. ఆర్.జి. భండార్కర్, కె.పి. జయస్వాల్, హేమచంద్ర రాయచౌధరి వంటి తొలితరం జాతీయవాద పండితులు ఈ స్వదేశీ చారిత్రక ఆధారాలను వెలికితీసినప్పుడు, భారతదేశానికి ఉన్న లోతైన చారిత్రక స్పృహను వారు నిరూపించారు. ఇప్పుడు ఆ పనిని కొనసాగిస్తున్న కొత్త తరం పండితులు కూడా ఉన్నారు. వారు నా కళ్ల ముందే ఉన్నారు, అది నాకు ఎంతో ఉద్వేగాన్ని కలిగిస్తుంది. మన చరిత్రకారుల కృషి, ఆ చారిత్రక సంప్రదాయం ఇప్పుడు తనదైన గుర్తింపును సంతరించుకుంటోంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొన్ని దశాబ్దాల పాటు మనం కోల్పోయింది ఇదే.

1947 తర్వాత ఏం జరిగింది? దానిని తిరస్కరించడం వల్ల చెల్లించాల్సిన మూల్యం ఏమిటి? రాజకీయ స్వాతంత్ర్యం దానితో పాటు మేధోపరమైన వలసవాద భావజాల విముక్తిని కూడా తీసుకువస్తుందని ఎవరైనా సహజంగానే ఆశించి ఉండవచ్చు, కానీ అది జరగలేదు. అందుకే, గౌరవనీయులైన ప్రధాన మంత్రి ఎర్రకోట ప్రాకారంపై నిలబడి, "పంచ ప్రాణ్: ఈ వలసవాద మనస్తత్వం నుండి బయటపడండి, వలసవాదానికి సంబంధించిన ప్రతిదాని నుండి బయటపడండి" అని

చెప్పాల్సి రావడంలో ఆశ్చర్యం లేదు. ఆయన ఆ మాటను ఇప్పుడు చెప్పాల్సి వచ్చింది. 60వ దశకం చివరలో, 70వ దశకంలో, కేంద్ర విద్యాశాఖల అండదండలతో... ICHR, NCERT, ICSSR వంటి ప్రముఖ పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాల అధ్యాపక విభాగాలు నిర్దిష్ట భావజాల నెట్‌వర్క్‌లకు కంచుకోటలుగా మారాయి. అవి భారీ స్థాయిలో ఉండేవి. వాటికి నిధులు, ప్రోత్సాహం రూపంలో భారీ మద్ధతు లభించేది.

ఫలితంగా, వారు అనేక పనులు చేయడంలో విజయం సాధించారు. వాటి ప్రభావం ఎంతగా పాతుకుపోయిందంటే, నేటికీ వాటిని తొలగించడం మనకు కష్టంగా మారింది. NCERT పాఠ్యపుస్తకాలు ప్రతి చారిత్రక దశలోనూ వర్గ సంఘర్షణను, ఆర్థిక నిర్ణయవాదాన్ని వ్యవస్థాగతం చేశాయి: రోమిలా థాపర్ - 'ఏన్షియంట్ ఇండియా' (1966), ఆర్.ఎస్. శర్మ - 'ఏన్షియంట్ ఇండియా' (1977), సతీష్ చంద్ర - 'మిడివల్ ఇండియా' (1978), బిపిన్ చంద్ర - 'మోడరన్ ఇండియా' (1971). అద్భుతం! ఇలా ఎన్ని సంపుటాలు! పైగా ఇవి పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు విస్తృతంగా చేరడమే కాకుండా, అధికారికంగా నిర్దేశించబడ్డాయి కూడా! చరిత్ర కథనమంతా వీటి చుట్టూనే అల్లుకుపోయింది. విజయనగర సామ్రాజ్యం, పల్లవులు, చోళులు, పాండ్యులు, అహోములు, మరాఠాలు, మన సముద్రయాన సామ్రాజ్యాల సాంస్కృతిక-చారిత్రక కొనసాగింపులను కేవలం అడుగుపెత్తుల (పాదపీఠికల) స్థాయికి పరిమితం చేశారు; అదే సమయంలో, ఆక్రమణదారులకు మాత్రం పూర్తి అధ్యాయాలను కేటాయించారు.

ఆ అధికారిక వైఖరిని లేదా వాదనను వ్యతిరేకించడం వల్ల కలిగే పర్యవసానాలను 1969లో స్వయంగా భైరప్ప గారే మనకు చూపించారు. భైరప్ప గారిని గురించిన వీడియోలో మనం ఆ విషయాన్ని చూశాము. జాతీయ సమగ్రత అనే లక్ష్యంతో పాఠశాల పాఠ్యపుస్తకాలను సమీక్షించడానికి, దౌత్యవేత్త జి.పార్థసారథి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక జాతీయ కమిటీని ఏర్పాటు చేసింది. కాశీ విశ్వనాథ్, మథుర ఆలయాల ధ్వంసానికి సంబంధించిన చారిత్రక ఆధారాలను పాఠ్యపుస్తకాల నుండి తొలగించాలని ఆ కమిటీ నిర్ణయించినప్పుడు, డాక్టర్ భైరప్ప ప్రాథమిక సూత్రాల ఆధారంగా దానిని వ్యతిరేకించారు. ప్రతి ఏటా లక్షలాది మంది యాత్రికులు కాశీ, మథురలను సందర్శిస్తారని, ధ్వంసం చేయబడిన ఆలయ కట్టడాలపైనే నిర్మించిన మసీదులను వారు స్వయంగా చూడగలరని ఆయన ఆ సందర్భంలో గుర్తుచేసారు.

ఆయన ఇలా సూటిగా ప్రశ్నించారు: చరిత్ర సత్యంపై ఆధారపడకపోతే, దానికి ఏ విలువ ఉంటుంది? ఈ విషయాన్ని నేను 2006 అక్టోబర్ 8 నాటి 'విజయ కర్ణాటక' పత్రికలో ప్రచురితమైన భైరప్ప గారి స్వంత వివరణ నుండి గ్రహించాను. దౌత్యవేత్త అయిన జి. పార్థసారథి, ఆ అభ్యంతరాలు విద్యాపరంగా సరైనవేనని అంతర్గతంగా అంగీకరించినప్పటికీ, ప్రభుత్వ విధానం దృష్ట్యా ఆ అంశాలను తొలగించక తప్పలేదని వాదించారు. అందుకే, చరిత్రను వక్రీకరించిన చరిత్రకారులకు ప్రభుత్వం నుండే భారీ స్థాయిలో ప్రోత్సాహం లభించిందని నేను అంటున్నాను. అయినా భైరప్ప తన పట్టు వీడలేదు దాదాపు రెండు వారాల తర్వాత, ఆయన లేకుండానే ఆ కమిటీని పునర్వ్యవస్థీకరించారు (ఈ విషయాన్ని మనం చూసిన వీడియోలోని ఇంటర్వ్యూలో ఆయన స్వయంగా చెప్పారు). ఆయన స్థానంలో ప్రభుత్వం ఆమోదించిన మరో చరిత్రకారుడు అర్జున్ దేవ్ నియమితులయ్యారు.

జ్ఞాపకాలను నిర్వహించేటప్పుడు నిజాయితీ లేని ఉద్దేశాలు చాలా అరుదుగా ఉంటాయి. అవి దాదాపు ఎప్పుడూ విచక్షణ లేదా హితచింతన పేరుతోనే నిర్వహించబడతాయి. సరిగ్గా అందుకే, దీనిని వ్యతిరేకించడం చాలా కష్టంగా మారుతుంది. ఈ అసమానత ఒక భాష తర్వాత మరొక భాషలోనూ కొనసాగింది. ఈ అసమానత తెలుగు సాహిత్యంలోనూ కనిపించింది. శ్రీశ్రీ అంటే శ్రీరంగం శ్రీనివాసరావు గారు తన 'మహాప్రస్థానం'లో విప్లవాత్మకమైన భావనను ఆవిష్కరించారు. ఆయన ఇలా అంటారు: " ఏ దేశ చరిత్ర చూసినా ఏముంది గర్వకారణం? నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం." ఏ దేశ

చరిత్రనైనా చూస్తే అన్న ఆ పంక్తులను నేను అనువదిస్తున్నాను...ఏ దేశ చరిత్రనైనా పరిశీలిస్తే గర్వపడటానికి అందులో ఏముంది? మానవజాతి చరిత్ర అంతా ఇతరులను పీడించడానికే అంకితమైన చరిత్ర. 1950లో వచ్చిన 'మహాప్రస్థానం'లోని 'దేశ చరిత్రలు' అనే కవితలో ఆయన ఈ విషయాన్ని పేర్కొన్నారు.

మరో ప్రసిద్ధ తెలుగు రచయిత అయిన చలం, ఒక అడుగు ముందుకు వేసి, వ్యవస్థలో స్థిరపడిన కుటుంబ, సామాజిక నిర్మాణాలను నేరుగా సవాలు చేశారు. మరోవైపు, భారతదేశ నాగరికత కొనసాగింపును సమర్థించిన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ నిలబడ్డారు. ఆయనను తరువాత ఒక పరిధిలో బంధించారు. ప్రపంచానికి మరో రామాయణం ఎందుకు అవసరమని అడిగినప్పుడు, ఆయన 'రామాయణ కల్పవృక్షం' పుస్తకాన్ని ఆ ధిక్కారపూరిత ప్రశ్నతో ప్రారంభించారు: "మరలనిదేల రామాయణం... బన్నాచో?" అంటే: "మీరు 'మళ్ళీ రామాయణమే ఎందుకు?' అని అడిగితే, ఇదిగో నేను: రామాయణ కల్పవృక్షం." తెలుగులో, ఈ ద్వారపాలకుల తీరు, వారు కొందరిని అనుమతించే విధానం, మరికొందరిని ఒక పరిధిలో బంధించే విధానం.

విశ్వనాథకు 1962లో సాహిత్య అకాడమీ పురస్కారం, ఆ తర్వాత 1970లో జ్ఞానపీఠ్ పురస్కారం లభించాయి. కానీ శ్రీశ్రీకి ఆ పురస్కారాలు దక్కలేదు. ఆయనకు పాఠకులు, అనుచరులు ఉండేవారు. పాఠకులే ఆయనకు సర్వస్వం. అయితే, నేను మీ ముందు ఉంచుతున్న ఈ రూపకం లేదా సందర్భంలో, ఆ విషయాలన్నీ సమానమైన ప్రభావాన్ని చూపాయా? అంటే, చూపలేదు. విమర్శకులు, పత్రికలు, పాఠ్యప్రణాళికలు, సాహిత్య రంగం అంతా కూడా అవతలి వర్గం చుట్టూనే అల్లుకుపోయాయి. విశ్వనాథను సంప్రదాయవాదిగా, పునరుజ్జీవనవాదిగా, పాత ఛందస్సును అంటిపెట్టుకుని ఉన్న వ్యక్తిగా ముద్రవేసి పక్కన పెట్టేశారు. ఆయన పాండిత్యాన్ని గుర్తించినప్పటికీ, దానిని పక్కన పడేశారు. కాబట్టి, ఇది కేవలం కర్ణాటక లేదా ఆంధ్రకే పరిమితం అనుకుంటే పొరపాటే. తమిళనాడులో పరిస్థితి ఇంకా దారుణంగా ఉండేది.

నేను కొంతకాలం తరువాతి నుండి మొదలుపెట్టి, వెనక్కి వెళ్తూ ఒక నిమిషం పాటు వివరిస్తాను. ఫిబ్రవరి 2009లో జరిగిన బడ్జెట్ ప్రసంగంలో, ఒక మంత్రి.. బహుశా ప్రొఫెసర్ అనగరన్ అనుకుంటాను, 28 మంది రచయితల గౌరవ మర్యాదలను పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. బడ్జెట్ ప్రసంగం, ఫిబ్రవరి 2009: "మేము 28 మంది రచయితల గౌరవ మర్యాదలను పునరుద్ధరిస్తున్నాము." అసలు ఆ 28 మంది రచయితలు ఎవరు? నేను వారి పేర్లను నేను చెబుతాను. కానీ వారి పేర్లు చెప్పే ముందు ఒక విషయం గమనించాలి. వీరు 1949 నుండి లేదా అంతకు కొంచెం ముందు నుండే ఉన్న రచయితలు. 1949లోనే డీఎంకే పార్టీ ఆవిర్భవించింది. అయితే అంతకు ముందే 'ద్రావిడర్ కజగం' పేరుతో ద్రావిడ ఉద్యమం మొదలైంది. అది ఒక రాజకీయ పార్టీ కంటే ఎక్కువగా సామాజిక-సాంస్కృతిక సంస్థగా ఉండేది.

అప్పటి నుండి, జాతీయవాదం లేదా హిందూమతం వంటి అంశాలు...అంటే రామాయణం, మహాభారతం వంటి హిందూ సంప్రదాయాలకు సంబంధించిన ఇతివృత్తాల ప్రభావం తమ రచనలలో ఉన్న ఏ రచయితనైనా ఒక నిర్దిష్ట వర్గానికి పరిమితం చేయడం, వారిని విస్మరించడం, లేదా వేధించడం, బహిరంగంగా అవమానించడం వంటి చర్యలకు గురిచేసేవారు. ఇలాంటి పరిస్థితిని చాలా మంది రచయితలు ఎదుర్కొన్నారు. ఈ ఉద్యమం చాలా తీవ్రమైనదిగా సాగింది. దీనికి ప్రభుత్వ మద్దతు కూడా ఉండేది. తమిళనాడులో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఓడిపోయిన తర్వాత, అధికారంలోకి వచ్చిన పార్టీ ఎప్పుడూ 'ద్రావిడవాదం' ప్రభావంతోనే నడిచేది. ఈ ద్రావిడవాదం జాతీయవాదానికి, సంస్కృత భాషకు, హిందూ భావజాల ప్రభావం ఉన్న ఏ అంశానికైనా వ్యతిరేకంగా ఉండేది.

ఒక సాధారణ ఉదాహరణను తీసుకుందాం: కంబన్ రచించిన 'కంబ రామాయణం' తమిళంలో రామాయణానికి ఒక గొప్ప ఉదాహరణ. ఇది వాల్మీకి రామాయణానికి యథాతథ అనువాదం కాదు. ఇందులో తమిళ జీవన విధానం, అంటే సముద్ర

తీర ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు, అక్కడి ప్రజల జీవనశైలి వంటి అంశాలు కూడా మిళితమై ఉంటాయి. ద్రావిడ ఉద్యమం దీనిని తీవ్రంగా విమర్శించింది. నేను పేర్లు ప్రస్తావించను కానీ, ఒక ప్రముఖ తమిళ రాజకీయ నాయకుడు రామాయణంలోని శృంగారరసానికి సంబంధించిన కొన్ని అంశాలను అత్యంత అభ్యంతరకరమైన రీతిలో రాశారు. రామాయణం అశ్లీలమైనదిగా భావించేలా దానిని చిత్రీకరించారు. ఆ స్థాయిలో వారు రామాయణాన్ని నిందించారు.
అప్పుడు ఒక గొప్ప దేశభక్తి కలిగిన తమిళ వ్యక్తి ఇలా అన్నారు: "లేదు, నేను దీనిని అంగీకరించను. రాముడు నా వీరుడు, రాముడు నా దేవుడు; అంతేకాక, నా పిల్లలు, భావి తరాలు తెలుసుకోవాల్సిన ఎన్నో మంచి విషయాలను రామాయణం నాకు బోధిస్తుంది." అందుకే, హిందూ, జాతీయవాద, సంస్కృత లేదా హిందూ భావజాలానికి సంబంధించిన దేనినైనా వ్యతిరేకించే అప్పటి అధికార యంత్రాంగానికి నిరసనగా, ఆయన తమిళనాడు అంతటా 'కంబర్ కళగం' అనే సంస్థను ఏర్పాటుచేశారు. ఆయన దీనిని విస్తృతంగా స్థాపించారు. నేటికీ, 'కంబ రామాయణం'ను ప్రచారం చేయడంలో ఆ 'కంబర్ కళగం' విజయవంతంగా కొనసాగుతోంది.

అదేవిధంగా, రసికమణి టి.కె. చిదంబరనాథ ముదలియార్ అనే మరో రచయిత ఉండేవారు. ఆయన కూడా రామాయణంలో గొప్ప పండితుడు. ఆయన 'కంబన్ తరుమ్ రామాయణం' (అంటే "కంబన్ అందించిన రామాయణం") అనే గ్రంథాన్ని రచించారు. "మీరు అలా ఎలా చేయగలరు?" అని ప్రశ్నిస్తూ ఆయనను వెలివేశారు. ఇలాంటి ఉదాహరణలు ఇంకా చాలా ఉన్నాయి. వైయాపురి పిళ్ళై గొప్ప పండితుడు, సాహిత్య విమర్శకుడు. ఆయనను కూడా బహిష్కరించారు. కాబట్టి, ఫిబ్రవరి 2009లో తమిళనాడు ఆర్థిక మంత్రి "మేము గౌరవ మర్యాదలను పునర్నిర్మిస్తున్నాము" అని పేర్కొన్న ఆ 28 మంది వ్యక్తులూ... జాతీయవాదులుగా ఉన్నకారణానికి, భారతదేశం మరియు భారతీయ ప్రాచీన సంస్కృతి గురించి ఆలోచించినందుకు బహిష్కరణకు గురైనవారే.

ద్రవిడ ఉద్యమంలో భాగమైన ఒక పార్టీయే అధికారంలోకి వచ్చి, బడ్జెట్ ప్రసంగంలో ఇలా ప్రకటించాల్సి రావడం గమనార్హం: "మేము ఆ గౌరవాన్ని పునరుద్ధరించాలనుకుంటున్నాము. రచయితలు తమ జీవితకాలంలో ప్రచురించిన పుస్తకాల సంఖ్య ఆధారంగా నిర్ణయించే విలువకు తగిన మొత్తాన్ని చెల్లిస్తాము." అయితే, ఈ పునరుద్ధరణ జరిగే సమయానికి వారిలో కొందరు అప్పటికే జీవించి లేరు. పైగా, తమ పుస్తకాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం (జాతీయీకరణ) పట్ల కొందరు అప్పట్లో నిరసన కూడా వ్యక్తం చేశారు. ద్రవిడ భావజాలం వల్ల దశాబ్దాల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలు, ఆ ద్రవిడ సంస్కృతిచే తిరస్కరించబడిన తమ తాతలు లేదా తండ్రులు రాసిన రచనలను తమ సొంత చిన్న ప్రచురణల ద్వారా వెలుగులోకి తెచ్చాయి. వారు "మేమే వాటిని ప్రచురించుకుంటున్నాము, మాకు వచ్చి చెప్పాల్సిన అవసరం మీకు లేదు. మేము 200 కాపీలో, 500 కాపీలో ప్రచురించవచ్చు, కానీ వాటిని జాతీయీకరించడానికి మీరెవరు? ఇన్నాళ్లూ ఆ రచనలను అవమానించింది మీరే కదా!" అని అన్నారు.

అయినా సరే, వాటిని జాతీయం చేశారు. కానీ మన స్వేచ్ఛా భారతదేశ సంరక్షకులకు వ్యతిరేకంగా వెళ్ళిన సైద్ధాంతిక రేఖల కోసం ప్రజలను ఇరికించిన చరిత్ర ఇది. వీరు భారతీయ సంస్కృతి గురించి గర్వంగా రాసిన వ్యక్తులు. ఆ 28 మందినీ, ఒక బడ్జెట్ ప్రసంగంలో, గౌరవం కోసం పునరుద్ధరించాల్సి వచ్చింది. అది 2009లో జరిగింది. కాబట్టి ఈ మొత్తం సంరక్షకుల యంత్రాంగానికి చాలా మద్దతు ఉంది. సోవియట్ ల్యాండ్ పబ్లికేషన్స్ ద్వారా మనలో ఎంతమంది ప్రభావితం కాకుండా ఉండేవారో చెప్పండి? ఎంత అద్భుతమైన పుస్తకాలు! వారు ప్రచురించిన పుస్తకాలు ఎంత అందంగా ఉండేవి. కానీ అవి ప్రచార సామగ్రి! దాని ద్వారా, పుష్కిన్‌ను అర్థం చేసుకోగలిగాను. ఎంత అందమైన చిత్రాలు! కానీ వీటన్నింటికీ కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ నిధులు సమకూర్చింది.

తమిళనాడులోని ప్రతి ఇంట్లోనూ వియత్నాం యుద్ధం గురించిన పుస్తకాలు ఉండేవి. కానీ, అమెరికా నుండి గోధుమలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో వివరించే పుస్తకాలు మాత్రం ఉండేవి కావు. ఆ విషయాన్ని చెప్పే పుస్తకాలు అసలు లేనే లేవు! తమిళంలో "ఏన్ ఇందా వియత్నాం పోర్?" (అంటే "ఈ వియత్నాం యుద్ధం ఎందుకు జరుగుతోంది?") అనే పుస్తకాలను నేను చదివాను. అయితే, ఈ ప్రచురణలకు, ఆ అద్భుతమైన సాంస్కృతిక కేంద్రానికి మద్ధతుగా వచ్చిన నిధుల గురించి శాంతిశ్రీ మనకు మరింత వివరంగా చెప్పగలరని నాకు నమ్మకం ఉంది. ఈ అద్భుతమైన ప్రచురణల ద్వారా ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం సుమారు 2000 సంవత్సరం వరకు కొనసాగిందని నా అభిప్రాయం. ఆ తర్వాత, సహజంగానే, విక్రమ్ సంపత్ వంటి వారు తమదైన రీతిలో కృషి చేస్తున్నారు.

ఇదొక ప్రపంచవ్యాప్త ధోరణి. కేరళ గురించి చెప్పడం నేను మర్చిపోయాను. అక్కడ 'ప్రభాత్ బుక్ హౌస్' 28 శాఖలను నడిపేది. మొబైల్ వ్యాన్ల ద్వారా గ్రామాలకు పుస్తకాలను పంపించేవారు. అవన్నీ ప్రచార సామగ్రికి సంబంధించినవే. పాల్ జకారియా వంటి రచయితలు కూడా ఒకప్పుడు, "12 ఏళ్ల వయసు వచ్చేసరికే నేను కరుడుగట్టిన కమ్యూనిస్టుగా మారిపోయాను" అని వ్యాఖ్యానించారు. పిల్లలపై దీని ప్రభావం ఎంతలా ఉందో ఊహించుకోండి! తమిళనాడులో కంబన్ (కవి) సాహిత్యాన్ని సజీవంగా ఉంచడానికి సా. గణేశన్ ప్రారంభించిన 'కంబర్ కళగం' గురించి నేను మీకు చెప్పాను. కానీ 2013 నాటికి కూడా.. మీలో ఎంతమందికి తెలుసో నాకు తెలియదు కానీ తమిళనాడు దక్షిణ ప్రాంతానికి చెందిన మత్స్యకార వర్గానికి చెందిన జో డి క్రూజ్, 'ఆళి సూళ్ ఉలగు' (సముద్రం చుట్టుముట్టిన ప్రపంచం) అనే పుస్తకాన్ని రాశారు.

సాహిత్య అకాడమీ ఆయనకు అవార్డును ప్రకటించింది. కానీ ఆయన అవార్డు స్వీకరించక ముందే, ప్రచురణకర్త, "లేదు, లేదు, మేము మీ పుస్తకాన్ని ప్రచురించము, క్షమించండి" అని అన్నారు. దాంతో అక్కడ పెద్ద రచ్చ జరిగింది. అసలు ఎందుకని? ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిని చాలా మంచి పరిపాలన చేసినందుకు, పరిశ్రమలు వస్తున్నందుకు, బహుళజాతి సంస్థలు అర్థం చేసుకుంటున్నందుకు ప్రశంసించారు. ఆయన స్వయంగా ఒక బహుళజాతి సంస్థలో పనిచేశారు, కానీ తాను చెందిన మత్స్యకారుల సమాజం గురించి, తీరప్రాంతం గురించి ఈ అద్భుతమైన పుస్తకాన్ని రాశారు. ప్రచురణకర్తలు ఆయన పుస్తకాన్ని ప్రచురించడానికి నిరాకరించారు! " మీరు ముఖ్యమంత్రిని అలా ఎలా ప్రశంసించగలరు?" అని అన్నారు. కాబట్టి ఇది 2013 వరకు కూడా కొనసాగింది.

ఆ సోవియట్ యుగంలో, 1934 ఆగస్టులో ఆంద్రీ జ్దానోవ్ ఇలా అన్నారు: "అవును, సోవియట్ సాహిత్యం పక్షపాతంతో కూడుకున్నది, ఎందుకంటే వర్గ పోరాట యుగంలో, వర్గ సాహిత్యం కానిది మరొకటి ఉండదు, ఉండజాలదు. అందువల్ల మేము ప్రచురిస్తాము." అది ఒక బహిరంగ ప్రకటన. ఆ ప్రచురణ కేవలం సోవియట్ భూభాగానికే పరిమితం కాలేదు. అది ప్రపంచమంతటా వ్యాపించింది. వారు ఎంత దూరం వెళ్లారంటే, అద్భుతమైన సంగీతకారుడైన చైకోవ్‌స్కీపై కూడా ముద్ర వేసి, మళ్లీ ముద్ర మార్చి, ఆ తర్వాత చాలా మార్పులు చేసి, అతన్ని నిజమైన రష్యన్ మేధావిగా అంగీకరించారు. కానీ మొదట అతనిపై ముద్ర వేసి బహిష్కరించారు, ఆ తర్వాత చాలా శుద్ధి చేసి, తిరిగి తీసుకువచ్చారు.

బ్రిటన్‌లో కూడా, రోజర్ స్క్రూటన్ వివిధ అంశాలపై మాట్లాడటం మీరు ఇటీవల కాలం వరకు వినే ఉంటారు. 1979లో తాను రాసిన 'ది మీనింగ్ ఆఫ్ కన్జర్వేటిజం' అనే పుస్తకం, తన విద్యాపరమైన వృత్తిలో మిగిలి ఉన్న అవకాశాలను ఎలా దెబ్బతీసిందో ఆయన వివరించారు. 1979 నాటి బ్రిటన్‌లో కూడా, రాజకీయంగా మితవాద దృక్పథంతో రచనలు చేసే ఒక వ్యక్తికి, ఆ పుస్తకం రాయడం వల్ల వృత్తిపరమైన భవిష్యత్తు లేకుండా పోయింది. తన కేంబ్రిడ్జ్ కళాశాల గ్రంథాలయంలో మార్క్స్, లెనిన్, మావోల రచనలు కనిపించాయి కానీ స్ట్రాస్, వోగెలిన్, హాయెక్ లేదా ఫ్రీడ్‌మాన్ రచనలు కనిపించలేదని ఆయన పేర్కొన్నారు. ఆయన ఈ విషయాన్ని 2003లో చెప్పారు. విద్యావ్యవస్థలో మితవాదులు ఎందుకు అట్టడుగున

ఉంచబడుతున్నారు, మీడియాలో ఎందుకు విమర్శలకు గురవుతున్నారు, రాజకీయ వర్గాలచే ఎందుకు అంటరానివారిగా పరిగణించబడుతున్నారు?

ఆ విషయం ఆయన రాసిన 'Fools, Frauds and Firebrands' (మూర్ఖులు, మోసగాళ్లు , రెచ్చగొట్టేవారు) అనే పుస్తకంలో ఉంది. యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశంలో కూడా అటువంటి వేధింపులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ఏర్పడిన ఏకాభిప్రాయాన్ని మార్గరెట్ థాచర్ ఇలా నిర్వచించారు: "ఎవరూ నమ్మని, కానీ ఎవరూ వ్యతిరేకించని ఒక విషయం కోసం అన్వేషిస్తూ... అన్ని నమ్మకాలు, సూత్రాలు, విలువలు , విధానాలను వదిలివేసే ప్రక్రియే అది." ఆ విషయాన్ని ఆమె అంత చక్కగా వివరించడం మార్గరెట్ థాచర్‌కే చెల్లింది. ఆ మాటలను మళ్లీ గుర్తుచేసుకోవడం ఎంతైనా అవసరం: "ఎవరూ నమ్మని, కానీ ఎవరూ వ్యతిరేకించని ఒక విషయం కోసం అన్వేషిస్తూ... అన్ని నమ్మకాలు, సూత్రాలు, విలువలు , విధానాలను వదిలివేసే ప్రక్రియ."

కాబట్టి ఈ రోజు, అభ్యంతరాలు చాలా స్పష్టంగా వినిపిస్తున్నాయని మనం చూస్తున్నాము. ఇక్కడి మేధావుల నుండి ఖచ్చితంగా కోరింది అదే: ఒక కృత్రిమ రాజకీయ ఏకాభిప్రాయానికి లొంగిపోండి లేదా సంస్థాగత నిర్మూలనను ఎదుర్కోండి. దశాబ్దాలుగా మనం దానిని చూస్తూనే ఉన్నాము. ఈ అడ్డుకట్ట కొనసాగుతూనే ఉంది. నేను చెప్పనవసరం లేదు, ఇక్కడే చూడండి: డాక్టర్ విక్రమ్ సంపత్, చరిత్రలో డాక్టరేట్ కలిగి, రాయల్ హిస్టారికల్ సొసైటీకి ఎన్నికైన ఫెలోగా ఉన్నప్పటికీ, వేలాది ప్రాథమిక పత్రాలు, వంద ప్రైవేట్ పత్రాల ఆధారంగా బహుళ సంపుటాల రచనలు చేసినప్పటికీ, అతని పరిశోధనలు అనుగుణంగా లేవనే కారణంతో, అతన్ని చరిత్రకారుడు కానివాడిగా, ఒక ప్రజాదరణ పొందిన రచయితగా, ఒక ఔత్సాహికుడిగా కొట్టిపారేయడానికి చురుకైన ప్రయత్నాలు జరిగాయని ఆయన ప్రశ్నించారు.

ఈ ద్వారపాలకుల నుండి వచ్చే సందేశం చాలా స్పష్టంగా ఉంది: మీకు డాక్టరేట్ ఉన్నా, మీ ఉల్లేఖనాలు ఎన్ని ఉన్నా, వారి సభ్యత్వ కార్డు లేకుండా, మీరు వేదికపైకి రాలేరు. అదే ద్వారపాలకులు విశ్వవిద్యాలయ పీఠాలను కలిగి ఉంటారు. ఒక పిల్లవాడు ఏమి చదవాలో, ఏమి చదవకూడదో నిర్ణయించే కమిటీలలో కూర్చుంటారు. ఏ పరిశోధనకు నిధులు ఇవ్వాలో, ఏ పరిశోధనకు నిశ్శబ్దంగా నిధులు ఇవ్వకూడదో వారే నిర్ణయిస్తారు. తాము ముందే ఒక దేశంపై తీర్పు చెప్పిన దాని గురించి వారు విదేశీ వార్తాపత్రికలలో రాస్తారు. అదేవిధంగా నేను వివరిస్తున్న యంత్రాంగానికి వారే వారసులు కూడా. కామింటెర్న్ పోయింది, కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ పోయింది. కానీ అది మనకు వదిలివెళ్లిన అలవాటు పోలేదు. ఆ అలవాటు ఏమిటంటే, సాక్ష్యం ఏమి చెప్పడానికి అనుమతించబడుతుందో ముందుగానే నిర్ణయించడం, ఆపై ఆ సాక్ష్యాన్ని భిన్నంగా చదివే ఎవరినైనా ప్రత్యర్థిగా కాకుండా శత్రువుగా పరిగణించడం.

ఇది విచారణ జరగకముందే తీర్పును నిర్ణయించుకోవడం లాంటిది. కాబట్టి, ముగింపుగా నేను కోరేది ఏమిటంటే.. మేము ఒక పక్షం గొంతును నొక్కేయాలని కోరడం లేదు, అలాగే ఆధిపత్యాన్ని ఒక వర్గం నుండి మరొక వర్గానికి మార్చడంలోనూ మాకు ఆసక్తి లేదు. ఆధిపత్యం అలాగే ఉండి కేవలం వ్యక్తులు లేదా పక్షాలు మారితే, ఎటువంటి విముక్తీ లభించదు; కేవలం నిర్వహణ మాత్రమే మారుతుంది. 'ఘట్టశ్రద్ధ' వంటి భిన్నమైన దృక్పథం కలిగిన సినిమా వచ్చినప్పుడు...బహుశా మీరు దాని గురించి వినే ఉంటారు...భారతదేశం దానిని చూసింది. భారతదేశంలోని కొందరు దానిని మెచ్చుకున్నారు, మరికొందరు దానిని గొప్పగా ఆదరించారు. ఆ ఉదారత పరస్పరం ఉండాలి.

ఆ ఉదారత పరస్పరం ఉండాలి. మేము మొత్తం వేదికను పునరుద్ధరించమని అడుగుతున్నాము: ఎడమవైపున స్థలం, కుడివైపున స్థలం, అన్నిరంగాల మేధావులు కలుసుకోగలిగే ఒక బహిరంగ కేంద్రం. సాక్ష్యాలను స్వయంగా బేరీజు వేసుకోగలరని విశ్వసించబడే వివేకవంతులైన ప్రజల ముందు ఆలోచనలు ఢీకొననివ్వండి. నేటి భారతదేశం

ఆత్మవిశ్వాసంతో ఉంది, దాని గురించి ఏమాత్రం పశ్చాత్తాపపడటం లేదు, మన స్వంత వారసత్వాన్ని అధ్యయనం చేయడానికి మనం ఇతరుల అనుమతి కోసం ఎదురుచూడటం మానేశాం. మనం మన శాసనాలను మళ్ళీ చదువుతున్నాము, మన సముద్ర వాణిజ్యాన్ని విశ్లేషిస్తున్నాము, మన గణితశాస్త్రంలోకి తిరిగి వెళ్తున్నాము, ఈ కథలను నిజమైన ఆనందంతోపాటు నిజమైన కచ్చితత్వంతో చెబుతున్నాము. వలసవాద విముక్తి అంటే ఇదేనని నేను భావిస్తున్నాను.

ఇది కేవలం ఒక నిర్దేశిత పాఠ్యపుస్తకాన్ని మరొకదానితో మార్చడం లాంటి విషయం కాదు. దీనికి విస్తృతమైన భాండాగారం, మరిన్ని భాషలు, కఠినమైన ప్రశ్నలు, వాస్తవానికి చదవబడే పండితుల యొక్క చాలా పెద్ద వలయం అవసరం. అన్నింటికంటే ముఖ్యంగా, సాక్ష్యం ఏమి చెప్పాలో ఏ సంస్థ కూడా ముందుగా నిర్ణయించకూడదు. చరిత్రకారులు, నవలా రచయితలు, చిత్రకారులు, కథకులు వంటి విభిన్న స్వరాలను ఈ రోజు గౌరవించడం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఇదే. రంగస్థలంపైకి అడుగుపెడుతున్న కొత్త స్వరాలు ఇవి. డాక్టర్ భైరప్ప తన 95వ ఏట మనల్ని విడిచి వెళ్లారు. ఆయన తప్పు చేయనివారు కాకపోవచ్చు, ఆయన అలా ఉన్నారని నటిస్తూ మనం ఆయన్ని గౌరవించడం లేదు. అయితే, ఆయన అత్యంత నిజాయితీపరుడు. ఆ నిజాయితీకి గొప్ప వృత్తిపరమైన మూల్యం చెల్లించారు. ఆయన తన వృత్తిని సరళంగా ఇలా సంగ్రహించారు: “మానవ సున్నితత్వాన్ని శుద్ధి చేయడమే సాహిత్యం యొక్క పని.” ఆయన ఎన్నడూ అనుచరుల సైన్యాన్ని సమీకరించడానికి ప్రయత్నించలేదు. మానవులు సత్యాన్ని గ్రహించే విధానాన్ని శుద్ధి చేయడానికి ప్రయత్నించారు. సత్యమత్తు సౌందర్య.. సత్యం, సౌందర్యం. మనలాంటి పురాతన నాగరికతకు, ఇది నిజంగా ఒక మేధో స్వరాజ్య చర్య. అవును, '91లో మనకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందని మీరు చెప్పింది నిజమే, ప్రోసెన్‌జిత్. కానీ మేధో స్వేచ్ఛ ఇప్పుడే బలం పుంజుకుంటోందని నేను అనుకుంటున్నాను. కాబట్టి మేధో స్వేచ్ఛ మనల్ని మనం తెలుసుకునే హక్కును ఇవ్వాలి. ఈ రోజు, సెప్టెంబర్ 5న, మన గురువులకు, అలాగే నేటి మేధావులైన డాక్టర్ భైరప్ప గారికి మనం అర్పించగల అత్యుత్తమ నివాళి ఏమిటంటే, భారతదేశ మేధో రంగం యొక్క రెండు విభాగాలను ప్రకాశవంతంగా వెలిగించడమే. తద్వారా ఈ ప్రక్రియ కొనసాగగలదు. ఈ మథనం కొనసాగనివ్వండి. సాక్ష్యం, కఠినత్వం, అదేవిధంగా మనస్సాక్షి చెప్పే చివరి మాటను చెప్పనివ్వండి. మనమందరం కలిసి, భారతదేశాన్ని ఈ మేధో స్వరాజ్య స్వర్ణయుగంలోకి ముందుకు తీసుకువెళ్దాం.

ధన్యవాదాలు